

అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....


# వన్ నేషన్


RNI NO. APTEL/2010/33523
తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 323 ఎడిటర్: కె.యువరాజ్ బుధవారం 2-9-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు




## హైవే విస్తరణకు ఆమోదం..

**- 6 వరుసలుగా విస్తరణ - రూ.12 వేల కోట్లతో పనులు! - ప్రయాణించిన దూరానికే టోల్ .. - కేంద్ర క్యాబినెట్ ఆమోదానికి ఫైలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (వన్‌నేషన్):** జాతీయ రహదారి 65 (హైదరాబాద్- విజయవాడ హైవే) విస్తరణలో కీలక ముందడుగు పడింది. హైదరాబాద్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకూ 285 కిలోమీటర్ల మేర.. ఈ రహదారిని రూ.12,073.99 కోట్లతో 6 వరుసలుగా విస్తరించేందుకు పబ్లిక్-ప్రైవేట్-పార్టనర్‌షిప్ అప్రైజల్ కమిటీ (పీపీపీఏసీ) ఆమోదం తెలిపింది. ఈ పనులను 3 ప్యాకేజీలుగా విభజించారు. హైదరాబాద్ దగ్గర ఓఆర్ఆర్ తరువాత వచ్చే ఆందోల్ మైసమ్మ ఆలయం నుంచి విజయవాడలోని గొల్లపూడి వరకు 181 కి.మీ మేర ఒక ప్యాకేజీ, హైదరాబాద్ నుంచి నందిగామ వరకూ 45 కి.మీ మేర రెండో ప్యాకేజీ, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు 59.69 కి.మీ మేర మూడో ప్యాకేజీ పనులు చేపట్టనున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు పనులను బిల్డ్-ఆపరేట్-టోల్ (బోట్) పద్ధతిలో, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్) విధానంలో పనులు చేయనున్నారు.

### కిలోమీటరుకు రూ.38 కోట్లు

అధికారుల అంచనాల ప్రకారం.. ప్యాకేజీ-1 పనులకు రూ.7,321.97 కోట్లు, ప్యాకేజీ-2 పనులకు రూ.2,965.11 కోట్లు, ప్యాకేజీ-3 పనులకు రూ.1,786.91 ఖర్చు కానుంది. భూసేకరణ, నిర్మాణ పనులు, జీఎస్టీ ఇలా

2లో



## గొడ్డలి పార్టీకి.. ఓటమి గుబులు

**భీమవరం, సెప్టెంబర్ 1 (వన్‌నేషన్):** రాష్ట్రంలో గొడ్డలి పార్టీకి ఓటమి భయం పట్టుకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. “ఎప్పుడు ఎన్నికలు వచ్చినా రాష్ట్రంలో కూటమి విజయం తథ్యమని సర్వే సంస్థలు నివేదికలిస్తున్నాయి. దీంతో గొడ్డలి పార్టీకి వణుకు పుడుతోంది” అని వ్యాఖ్యానించారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులో మంగళవారం జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ ప్రజా వేదికలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. కార్యకర్తలు, మహిళలు, రైతులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ, జగన్‌ల వైఖరిని దుయ్యబట్టారు. “గొడ్డలి పార్టీ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని నిర్వహించాం. దాన్ని అడ్డుకోవడానికి గొడ్డలి పార్టీ 356 కేసులు వేసింది. వాటిని పరిష్కరించాం. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. చదువుకున్న వాళ్లంతా తమ సామర్థ్యంతో ఉద్యోగాలు సాధించారు. ఇప్పుడు గొడ్డలి పార్టీ కోడి గుడ్డుపై ఈకలు పీకుతోంది. యువతకు టీచర్ ఉద్యోగాలిస్తే లేనిపోని ఆరోపణలు చేస్తోంది. కష్టపడి ఉద్యోగం సంపాదించుకున్న ఉపాధ్యాయులు ఆ పార్టీపై తిరగబడ్డారు. కర్నూలు కొండారెడ్డి బురుజు ఎక్కి నినదించారు. విజయవాడలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. విశాఖలో ఆందోళన చేపట్టారు. అన్యాయంగా అక్రమంగా ఉద్యోగాలు సాధించామని అవమానిస్తే బంగాళాఖాతంలో కలిపేస్తామంటూ గొడ్డలి పార్టీని హెచ్చరించారు. దాంతో ఆ పార్టీ భయపడింది.” అని అన్నారు. “మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల చైర్మన్లు/మేయర్లకు ప్రత్య క్ష ఎన్నికలు నిర్వహిస్తున్నాం. వివాదం

3లో

## సమాచార, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులుగా డి.ఎస్. జగన్

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (వన్‌నేషన్):** సమాచార, పౌర సంబంధాల శాఖలో డి.ఎస్. జగన్ అదనపు సంచాలకుడిగా (Additional Director) పదోన్నతి పొందారు. పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డి.ఎస్. జగన్ డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గౌరవ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డి.ఎస్. జగన్‌కు పదోన్నతి సందర్భంగా అభినందనలు తెలియజేశారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంతో పాటు ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం డి.ఎస్. జగన్ సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డా. జి. ముకుంద రెడ్డి గారిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పెషల్ కమిషనర్ ఆయనకు పదోన్నతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించిన డి.ఎస్. జగన్ మాట్లాడుతూ, తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయడంలో శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది డి.ఎస్. జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## టాప్-4వ రైల్వేస్టేషన్‌గా సికింద్రాబాద్

**- ప్రయాణికులు 2.78 కోట్లు.. - ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య అనుసంధానంగా ఉండటంతో కీలకం - వచ్చే ఏడాది 3వ స్థానానికి చేరే - అవకాశం ఉందంటున్న అధికారులు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (వన్‌నేషన్):** దేశంలో అత్యధిక వార్షికాదాయం కలిగిన రైల్వేస్టేషన్ల జాబితాలో సికింద్రాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు లభించింది. అటు ఆదాయంతోపాటు ఇటు ప్రయాణికుల సంఖ్యలోనూ టాప్-4వ స్టేషన్‌గా నిలిచింది. తొలిస్థానంలో న్యూఢిల్లీ సిటీసెంటర్ రైల్వేస్టేషన్ ఉండగా.. తర్వాత హౌరా, చెన్నై రైల్వేస్టేషన్లు ఉన్నాయి. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,276.29 కోట్ల (ప్రయాణికుల) ఆదాయంరాగా, సుమారు 2.78 కోట్ల మంది రాకపోకలు సాగించారు. రైల్వే తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది. హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా వంటి ఇతర ప్రధాన నగరాలను అనుసంధించడంలో సికింద్రాబాద్ స్టేషన్ కీలకంకావడంతో

3లో


వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో
కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై
అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని
అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో
రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల
వ్యాప్తంగా జిల్లాలు, మండలాల
వారీగా పనిచేసే విలేకరులు
కావలెను.
9948222240

# యెర్రం విజయ్ కుమార్ జ్యోతి ప్రజ్వలనతో ఘనంగా ప్రారంభమైన ఎల్ఐసీ 70వ వార్షికోత్సవం



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (వన్‌నేషన్): భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) 70వ వాకోత్సవ వేడుకలు సౌత్ సెంట్రల్ జోనల్ కార్యాలయంలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సౌత్ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లోని సైఫాబాద్‌లో సౌత్ సెంట్రల్ జోన్ జోనల్ మేనేజర్ శ్రవణ్ రమేష్ k.vital.ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ వారోత్సవాలకు ప్రముఖ వ్యాపారవేత్త, వాసవి కన్స్ట్రక్షన్స్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ యెర్రం విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించారు.

# ఆర్‌అర్ మౌంట్ పార్క్‌లో వరుస చోరీలు..

## పోలీసు రక్షణ కోరుతూ నివాసితుల పిటిషన్



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (వన్‌నేషన్): బడంగ్‌పేట్‌లోని మౌంట్ కార్మెల్ గ్లోబల్ స్కూల్ సమీపంలో ఉన్న AAR మౌంట్ పార్క్ HMDA లేఅవుట్‌లో వరుస చోరీలు జరుగుతున్నాయంటూ అక్కడి ఇళ్ల యజమానులు, నివాసితులు మీర్‌పేట్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు 2026 ఆగస్టు 30న మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు వినతిపత్రం సమర్పించి, తక్షణ పోలీసు రక్షణ,



క్రమం తప్పకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని కోరారు. గత మూడు నెలలుగా నిర్మాణంలో ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు జరుగుతున్నాయని నివాసితులు పిటిషన్‌లో పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య గోడల్లో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ వైరింగ్‌ను కత్తిరించి ఎత్తుకెళ్లడంతో పాటు, సెంటరింగ్ మెటీరియల్, ఇతర నిర్మాణ సామగ్రి కూడా చోరీకి గురవుతున్నాయని తెలిపారు.

ఇప్పటివరకు సుమారు ఆరు ఇళ్ల యజమానులు ఈ చోరీల కారణంగా ప్రభావితమయ్యారని, ఒక్కో ఇంటికి సుమారు రూ.4 నుంచి రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. వైరింగ్‌ను తిరిగి ఏర్పాటు చేసుకోవడానికి అదనపు ఖర్చు భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే జూన్ 12న ప్లాట్ నంబర్ 59కు చెందిన శ్రీ ఉమాకాంత్, అలాగే ఆగస్టు 26న ప్లాట్ నంబర్ 73కు చెందిన శ్రీ గురు రవి మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. పోలీసులు లేఅవుట్‌ను సందర్శించి, వాచ్‌మెన్ ఏర్పాటు చేసుకోవడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఉదయం, సాయంత్రం వేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు లేఅవుట్ పరిసరాల్లో గుమిగూడడం, మద్యం సేవించడం, అనుమానాస్పద కార్యకలాపాలు, వ్యక్తుల మధ్య గొడవలు జరుగుతున్నట్లు నివాసితులు పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. అయితే ఎవరిపైనా నిర్దిష్ట ఆరోపణలు చేయడం లేదని, ఇటువంటి పరిస్థితులు మహిళలు, చిన్నారులు, కుటుంబాల్లో భయాందోళనకు కారణమవుతున్నాయని తెలిపారు. వరుస చోరీలు, భద్రతా సమస్యలపై ఆగస్టు 28న స్థానిక మీడియా కూడా ప్రాంతాన్ని సందర్శించి విషయం వెలుగులోకి తీసుకువచ్చిందని పిటిషన్‌లో పేర్కొన్నారు.



ఈ నేపథ్యంలో రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ప్రత్యేకంగా పోలీస్ పెట్రోలింగ్, ఉదయం, సాయంత్రం వేళల్లోనూ క్రమం తప్పకుండా పోలీసుల సందర్శనలు నిర్వహించాలని నివాసితులు కోరారు. ఇప్పటికే నమోదైన చోరీ కేసులను త్వరగా దర్యాప్తు చేసి, సీసీటీవీ ఫుటేజీ, ఇతర ఆధారాలను పరిశీలించి దొంగలను గుర్తించి, చోరీకి గురైన ఎలక్ట్రికల్ వైరింగ్, సెంటరింగ్ మెటీరియల్, నిర్మాణ సామగ్రిని రికవరీ చేయాలని పోలీసులను విజ్ఞప్తి చేశారు. అలాగే లేఅవుట్‌లో ఎలాంటి అక్రమ, అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకోకుండా నివారణ చర్యలు చేపట్టి, నివాసితులకు భద్రత కల్పించాలని పోలీస్ అధికారులను కోరారు.

# ఆడబిడ్డల భద్రతకు అభయహస్తం

## -తెలంగాణలో షీ టీమ్స్ నిఘా.. కేంద్రం కఠిన చట్టాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (వన్‌నేషన్): మహిళలు, బాలికల భద్రతకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. ముఖ్యంగా ప్రజా రవాణా, విద్యాసంస్థలు, కార్యాలయాలు, మార్కెట్లు, రద్దీ ప్రాంతాల్లో మహిళలపై వేధింపులు, అసభ్య ప్రవర్తన, వెంటాడటం వంటి ఘటనలను అరికట్టేందుకు మహిళా పోలీస్ విభాగం, షీ టీమ్స్ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతోంది. మరోవైపు మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలు, ప్రత్యేక పథకాలు, సాంకేతిక వ్యవస్థలను అమలు చేస్తోంది.

### షీ టీమ్స్‌తో ప్రత్యేక నిఘా...

తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన షీ టీమ్స్ వ్యవస్థ మహిళల భద్రతలో కీలక పాత్ర పోషిస్తోంది. మహిళలను వేధించే వ్యక్తులపై నిఘా ఉంచడం, ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించడం, అవసరమైన చోట ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం ద్వారా వేధింపులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

బస్సులు, మెట్రో స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, విద్యాసంస్థల పరిసరాలు, పార్కులు వంటి ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు నిఘా నిర్వహిస్తున్నాయి. బాలికలను వెంటాడటం, అసభ్యకర వ్యాఖ్యలు చేయడం, అనుమతి లేకుండా ఫొటోలు లేదా వీడియోలు తీయడం, సోషల్ మీడియాలో వేధించడం వంటి చర్యలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

### మహిళా పోలీసుల పాత్ర కీలకం...

ప్రతి పోలీస్ స్టేషన్‌లో మహిళలకు సులభంగా ఫిర్యాదు చేసే వాతావరణం కల్పించేందుకు మహిళా పోలీసు సిబ్బంది సేవలను మరింత విస్తరిస్తున్నారు. బాధిత మహిళలు తమ సమస్యలను ధైర్యంగా వెల్లడించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల కేసుల్లో బాధితులకు న్యాయం అందించేందుకు ప్రత్యేక దర్యాప్తు విధానాలు, మహిళా సహాయక కేంద్రాలు, కౌన్సెలింగ్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

### అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందన...

మహిళలు ప్రమాదంలో ఉన్నప్పుడు పోలీసు అత్యవసర సేవలను వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112 ద్వారా పోలీసు సహాయం పొందవచ్చు. మహిళలపై వేధింపులు, హింస, ఇతర నేరాలకు సంబంధించి అందే ఫిర్యాదులపై వేగంగా స్పందించే వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు.

### సాంకేతికతతో భద్రతకు బలం...

సీసీ కెమెరాల ఏర్పాటు, కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థలు, డిజిటల్ ఫిర్యాదు విధానాలు, సోషల్ మీడియా నిఘా వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని మహిళల భద్రత కోసం వినియోగిస్తున్నారు. ముఖ్యంగా సైబర్ వేధింపులు పెరుగుతున్న నేపథ్యంలో మహిళలు, బాలికలపై సోషల్ మీడియా ద్వారా జరిగే బెదిరింపులు, అసభ్య సందేశాలు, మార్ఫింగ్ వంటి నేరాలపై సైబర్ క్రైమ్ విభాగాలు చర్యలు తీసుకుంటున్నాయి.

### కేంద్రం నుంచి కఠిన చర్యలు...

మహిళలు, చిన్నారులపై నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చట్టపరమైన, పరిపాలనా చర్యలు చేపట్టింది. లైంగిక వేధింపులు, అత్యాచారాలు, చిన్నారులపై లైంగిక నేరాల విషయంలో కఠిన నిబంధనలు అమలులో ఉన్నాయి. పోక్సో చట్టం (పాక్సో) ద్వారా చిన్నారులను లైంగిక నేరాల నుంచి రక్షించేందుకు ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తున్నారు. బాలికలపై జరిగే లైంగిక దాడుల కేసుల్లో నేరస్తులకు కఠిన శిక్షలు విధించే అవకాశాన్ని చట్టాలు కల్పిస్తున్నాయి.

అలాగే కార్యాలయాల్లో మహిళలు ఎదుర్కొనే లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక నిబంధనలు అమలులో ఉన్నాయి. ప్రతి సంస్థలో ఫిర్యాదులను పరిశీలించేందుకు అంతర్గత కమిటీల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

### మహిళా భద్రతకు ప్రత్యేక పథకాలు...

కేంద్ర ప్రభుత్వం మహిళల భద్రత కోసం చేపట్టిన పథకాలలో నిర్భయ నిధి కీలకమైనది. మహిళల భద్రతకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, సాంకేతిక వ్యవస్థలు, అత్యవసర సహాయ సేవల అభివృద్ధికి ఈ నిధి ద్వారా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు.

అదేవిధంగా వన్ స్టాప్ సెంటర్ల ద్వారా హింసకు గురైన మహిళలకు వైద్య సహాయం, పోలీసు సహకారం, న్యాయ సలహాలు, కౌన్సెలింగ్ వంటి సేవలను ఒకేచోట అందించే ప్రయత్నం చేస్తున్నారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం...

స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా వినియోగం పెరగడంతో బాలికలు సైబర్ నేరాల బారినపడే ప్రమాదం కూడా పెరుగుతోంది. గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోకూడదని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత ఫొటోలు పంపడంలో జాగ్రత్త వహించాలని పోలీసులు సూచిస్తున్నారు.

సైబర్ వేధింపులు ఎదురైతే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయాలని అధికారులు చెబుతున్నారు.

### కుటుంబం నుంచే భద్రతపై అవగాహన...

ఆడబిడ్డల భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, కుటుంబం, విద్యాసంస్థలు, సమాజం సమష్టిగా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. బాలికలకు మంచి స్పర్శ--చెడు స్పర్శపై అవగాహన కల్పించడం, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో నేర్పించడం, వారి సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునే వాతావరణాన్ని కుటుంబంలో కల్పించడం అవసరమని సూచిస్తున్నారు.

### సమాజం కూడా బాధ్యత తీసుకోవాలి...

మహిళలపై వేధింపులు లేదా బాలికలపై అనుమానాస్పద ఘటనలు కనిపిస్తే ప్రేక్షకులుగా ఉండకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు. మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ద్వారా మాత్రమే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంటున్నారు.

షీ టీమ్స్ నిఘా, మహిళా పోలీసుల సేవలు, అత్యవసర స్పందన వ్యవస్థలు, కేంద్ర ప్రభుత్వ కఠిన చట్టాలు కలిసి తెలంగాణలో ఆడబిడ్డల భద్రతకు మరింత భరోసా కల్పిస్తున్నాయి. అయితే చట్టాల అమలుతో పాటు ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించినప్పుడే మహిళలకు నిజమైన భద్రత సాధ్యమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

-సయ్యదా ఆలియా ఇస్మత్
సీనియర్ పాత్రికేయురాలు
సెల్: 8639754985

# హైవే విస్తరణకు పీపీపీఏసీ ఆమోదం

(1వ పేజీ తరువాయి)

అన్ని ఖర్చులూ కలిపి ఒక్కో కిలోమీటరుకు సగటున రూ.38 కోట్ల దాకా ఖర్చవుతుందని అంచనా. తెలంగాణలో యాదాద్రి భువనగిరి, నల్గొండ, సూర్యాపేట జిల్లాల మీదుగా, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టీఆర్, కృష్ణా జిల్లాల మీదుగా రోడ్డ విస్తరణ జరగనుంది. భూసేకరణకు.. తెలంగాణ పరిధిలోని ప్యాకేజీ-1కి రూ.529.45కోట్లు, ప్యాకేజీ-2కి రూ.924.43 కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. రెండు ప్యాకేజీలకూ కలిపి 1,387.628 హెక్టార్ల భూమి అవసరమని తేలగా, ఇందులో 1,174.295 హెక్టార్ల భూమి అందుబాటులో ఉంది. అదనంగా ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించాల్సింది 213.33 హెక్టార్లే. అలాగే విజయవాడ-మచిలీపట్నం మార్గంలో విస్తరణకు 351.185 హెక్టార్లు కావాల్సి ఉండగా.. 344.685 హెక్టార్లు అందుబాటులో ఉంది. అంటే అదనంగా కావాల్సింది 6.50 హెక్టార్లే.

ఎన్‌హెచ్-65లో హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం మార్గం మొత్తాన్ని 'హై స్పీడ్ కారిడార్'గా మార్చనున్నారు. 6 వరుసలుగా విస్తరించి, రెండు వైపులా క్రాష్ బారియర్స్ ఏర్పాటుచేయనున్నారు. అంటే ఇప్పుడున్న రెండు వరుసల రోడ్డుకు అటుఇటు మరొక రోడ్డు వస్తుంది. దీనికి అదనంగా రోడ్డుకు రెండువైపులా రెండు వరుసలుగా సర్వీస్ రోడ్డును అందుబాటులోకి తీసుకురానున్నారు. మొత్తం దూరంలో ప్రతి 15-18 కిలో మీటర్లకు ఒక దగ్గర ఎంట్రీ-ఎగ్జిట్ పాయింట్లను ఇవ్వనున్నారు. దీని ప్రకారం రెండు వైపులా కలిపి 30 చోట్ల టోల్ ప్లాజాలు రానున్నాయి. అయితే ఈ మార్గం విస్తరణలో భాగంగా.. ప్రయాణించిన దూరానికే టోల్ వసూలు చేసేలా కొత్త సాంకేతికతను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఔటర్ రింగు రోడ్డు తరహాలో.. ఈ రహదారి ఎక్కే సమయంలో స్కాన్ అవుతుంది. మళ్లీ ఎక్కడ దిగాలనుకుంటామో అక్కడే టోల్ ఉంటుంది.

# ప్రజా సంక్షేమం అభివృద్ధి టిడిపి తన సాధ్యం- ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 1 (వన్‌నేషన్):** ఎమ్మిగనూరు పట్టణంలోని మిలిటరీ కాలనీ 29వ వార్డులో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంగళవారం ముందుగా శ్రీ తాయమ్మవ్వదేవి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు.



అనంతరం వార్డులో నూతన సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తదుపరి రెండేళ్ల ఎన్డీఏ ప్రభుత్వం -- నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణ ప్రజలకు 24 గంటల తాగునీటి సరఫరా అందించేందుకు పైప్‌లైన్ ప్రాజెక్టును ఇటీవల ప్రారంభించామని తెలిపారు. అలాగే ఇంటిగ్రేటెడ్ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ పార్క్ ద్వారా చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య, టిడిపి పట్టణ అధ్యక్షులు మహేష్ వార్డు కమిటీ సభ్యులు, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల పై నిరసనలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలి

### మంద సంజీవరెడ్డి పిలుపు

**మేడ్చల్ /మేడిపల్లి/ సెప్టెంబర్ 01/వన్ నేషన్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సమన్వ య సమావేశం నిర్వహించారు. బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ మంద సంజీవరెడ్డి మరియు ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలన కు నిరసనగా సెప్టెంబర్ 1 నుండి 8వ తేదీ వరకు బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన నిరసన కార్యక్రమాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మాట్లా డుతూ.. ఎన్నికల్లో అమలు కాని హామీలతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని మండి పడ్డా రు. వెయ్యి రోజుల పాలన లో మహిళలు, రైతులు, యువకులు సహా అన్ని వర్గాల ప్రజలను ఆ పార్టీ మోసగించిందని విమర్శిం చారు. ఈ మోసాలను ఎండ గట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా వారం



రోజుల పాటు నిరస న కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు.నిరసన ల్లో భాగంగా నేడు (సెప్టెంబర్ 2) ఉదయం 9:00 గంటలకు బోడుప్పల్‌లోని అంబేద్కర్ విగ్రహం నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్లకార్డులతో ఈ ర్యాలీ కొనసాగుతుందని తెలిపా రు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ పార్టీ నాయకులు, మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, మాజీ కార్పొ రేటర్లు, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు, ఉద్యమ కారులు, సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, రామచం ద్రారెడ్డి, బందారం శ్రీధర్ గౌడ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# టాప్-4వ రైల్వేస్టేషన్‌గా సికింద్రాబాద్

టాప్ స్టేషన్లలో నిలిచిందని రైల్వేశాఖ వెల్లడించింది. రూ. 714కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి (సీపీఆర్ఓ) శ్రీధర్ తెలిపారు. ప్రపంచ స్థాయి సదుపాయాల కల్పనతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ మరిన్ని రైళ్లకు, భారీ సంఖ్యలో ప్రయాణికులకు సేవలు అందించగలుగుతుందని వివరించారు. దీనితో టాప్-3వ స్థానానికి చేరే అవకాశమూ ఉందన్నారు.

# యువత క్రీడల వైపు అడుగులు వేయాలి

## -హైదరాబాద్ వార్ ట్రోఫీ టీ 20 టోర్నమెంట్ ప్రారంభించిన

## -ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (వన్‌నేషన్):** యువత డ్రగ్స్, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల వైపు అడుగులు వేయాలని ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం, బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్గుల్ 57వ డివిజన్ పరిధిలోని కే.ఎస్.ఎమ్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో, టోర్నమెంట్ చైర్మన్లు కొర్రా మహిపాల్, కొర్రా






యుగేందర్‌ల నేతృత్వంలో నిర్వహించనున్న 'హైదరాబాద్ వార్ ట్రోఫీ- టీ20' పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా సెప్టెంబర్ 2న ప్రారంభం కానున్న ఈ టోర్నమెంట్‌లో మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. యువ క్రీడాకారులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు అకాడమీ అభివృద్ధి కోసం తన వంతుగా లక్ష రూపాయలు చెక్కు రూపంలో ఆర్థిక సాయం అందించి, అలాగే క్రీడాకారులకు 100 టీ-షర్టులను స్పాన్సర్ చేస్తున్నట్లు రాఘవేందర్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యమిస్తోందని, అందులో భాగంగానే ఫ్యూచర్ సిటీలో సుమారు 100 ఎకరాల్లో భారీ స్టేడియం నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఈ టోర్నమెంట్ విన్నర్ కు లక్ష రూపాయలు, రన్నరప్ కు 50 వేల నగదు బహుమతులు అందించనున్నారు. టోర్నమెంట్ ఫైనల్ విజేతలకు తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె. శివసేన రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీని అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడలను ప్రోత్సహిస్తూ టోర్నమెంట్ నిర్వహిస్తున్న కె ఎస్ ఎం క్రికెట్ అకాడమీ నిర్వాహకులను ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రపంచంలో ఇన్సూరెన్స్ రంగంలో అగ్రగామి ఎల్ఐసి

## - ఘనంగా ఎల్ఐసి 70 వ వారోత్సవాలు

**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 1 (వన్‌నేషన్):** ప్రపంచంలో ఇన్సూరెన్స్ రంగంలో అగ్రగామి సంస్థ గా ఎల్ఐసి ఒకటిగా ఉందని ఆర్టీసీ డిపో మేనేజర్ సి మద్దిలేటి నాయుడు, ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ వైకుంఠం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయం నందు ఎల్ఐసి 70 వ వారోత్సవాలు ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ఐసి ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థ. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ఒక వెన్నుముకని అన్నారు . ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎల్ఐసి ఇందులో అన్ని రకాల



వయసులో వారికి పాలసీలు ఉన్నాయని, తమ పిల్లల కలల నెరవేర్చడానికి ఎంతో తోడ్పడుతాయన్నారు. ఎల్ఐసి క్లైముల పరిష్కారంలో 99% పైగానే పాలసీదారులకు అందుతున్నాయన్నారు. ఎల్ఐసి లో పెట్టుబడి పెట్టే ప్రతి పైసా సురక్షితమని వారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ సంతోష్ కుమార్, ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ పాటిల్ తిమ్మారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు ఇందిరా, ప్రతాప్, రవి నాయక్, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు విజయకుమార్ సిబ్బంది రఘునాథ్ గౌడ్ గోవర్ధన్ మురళి శ్రీవాణి వీరారెడ్డి వెంకటేష్, లియాఫీ నాయకులు రమేష్ ప్రభాకర్ రెడ్డి వీరేష్ ప్రసాదు ప్రభాకర్ సీనియర్ ఏజెంట్లు రంగస్వామి పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (వన్‌నేషన్): సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఆవరణలోని బంగారు మైసమ్మకు బోనాలు సమర్పించారు. ఆస్పత్రి సిబ్బంది రేణుక, శశికళ ఆధ్వర్యంలో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

# గొడ్డలి పార్టీకి ఓటమి గుబులు..

(1వ పేజీ తరువాయి)

లేకుండా ఐదేళ్ల పా టు చైర్మన్ ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నాం. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉంటేనే సరిపోదు. స్థానిక పాలన కూడా ఉండాలి. ఎన్నికలు ఎప్పుడు పెట్టినా కూటమికి తిరుగులేదు. గొడ్డలి పార్టీ కుల, ప్రాంత, మత విద్వేషాలు రెచ్చగొడుతోంది. స్థాని క సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్‌ను తగ్గించేసింది. మళ్లీ పెంచేందుకు మేం ప్రయత్నిస్తుంటే, కోర్టుకు వెళ్లారు. ఎన్నికలు అడ్డుకోవడమే గొడ్డలి పార్టీ ఆలోచన." "రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు ఉన్నాయి. గ్రామాల్లో పేదలుంటే అభివృద్ధి జరిగినట్టు కాదు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ. 3.50 లక్షల తలసరి ఆదాయం ఉంది. ఇది 2047 నాటికి రూ. 54 లక్షలకు చేరుకుంటుంది. కానీ కనీస ఆదాయం లేని పేదలు అప్పుడు కూడా ఉండవచ్చు. అందుకే ఆర్థికంగా అందరూ ఎదగాలనే ఉద్దేశంతో ఓ వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. గ్రామంలో ఇంకా పేదలుంటే అది గ్రామానికే అవమానం."

'ప్రభుత్వపరంగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. వృద్ధులకు రూ. 4 వేలు పింఛన్ ఇస్తున్నాం. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు బటన్ నొక్కి పెన్షన్ ఇచ్చేశామనుకునేవారు. ఇప్పుడు ప్రతీ ఇంటికి పెన్షన్ ఇస్తున్నాం. పింఛన్‌ను 4 వేలకు పెంచింది మేమే. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇప్పటి దాకా రూ. 73,507 కోట్లు పెన్షన్ల రూపంలో ఇచ్చాం. సంక్షేమంలో భాగంగానే వడ్డెర్లకు మైనింగ్‌లో, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్ ఇచ్చాం. చేనేత, మత్స్యకార కుటుంబాలకు ఏటా రూ. 20 వేలిస్తున్నాం. ఇన్ని విధాలుగా సంక్షేమం చేస్తున్నా ఎన్నికల సమయంలో డబ్బులు తీసుకుంటున్నారు. కేవలం రూ. 2 వేలు, వెయ్యి రూపాయల కోసం ఆశ పడితే ఎన్నికల్లో గెలిచిన వాడు డబ్బులు సంపాదించకుండా ఉంటాడా? అందుకే డబ్బులిస్తే వద్దని చెప్పండి. అప్పుడు అవినీతి లేని పాలన వస్తుంది"

## ఆనంద్, వైష్ణవి 'చెన్నై లవ్‌స్టోరీ' చేయకపోవడానికి కారణమిదే!



కొన్ని ఆసక్తికర కాంబినేషన్‌లను మళ్లీ మళ్లీ చూడాలనుకుంటారు ప్రేక్షకులు. దర్శక-రచయితలు కూడా వారిని దృష్టిలో పెట్టుకునే కథలు సిద్ధం చేస్తారు. తీరా సెట్స్‌పైకి వెళ్లే సమయానికి అనుకోని కారణాల వల్ల నటీనటులు మారిపోతుంటారు. ఇటీవల విడుదలై ఫీల్ గుడ్ మూవీగా పేరు తెచ్చుకున్న 'చెన్నై లవ్‌స్టోరీ' విషయంలోనూ ఇదే జరిగింది. తొలుత ఈ కథను మేకర్స్ హిట్ పెయిర్ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్యలను దృష్టిలో పెట్టుకునే మొదలు పెట్టారు. వాళ్లిద్దరూ కూడా చేయడానికి ఆసక్తి చూపారు. కానీ, కొన్ని కారణాల వల్ల ఆ మూవీ చేయలేకపోయినట్లు తాజాగా ఆనంద్ దేవరకొండ చెప్పుకొచ్చారు. "చెన్నై లవ్‌స్టోరీ' నేనూ వైష్ణవి చేయాల్సింది. అప్పటికి నాకు వేరే షెడ్యూల్స్ ఉన్నాయి. పైగా అది స్క్రిప్ట్ డెవలప్‌మెంట్ దశలోనే ఉంది. దీంతో సమయం ఎక్కువైపోయింది. 'నేను ఇంకో సినిమా చేయాలి' వాళ్లతో చెప్పాను. 'సరే మేం వేరే హీరోను ప్రయత్నిస్తాం' అని చెప్పారు. వాళ్లు వేరే హీరో అనుకున్నప్పుడు కథానాయికగా కూడా వేరే వాళ్లను తీసుకుంటే బాగుంటుందని వాళ్లు భావించి ఆ సినిమా తీశారు" అని అన్నారు.

ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'. ఆదిత్య హాసన్ దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. సెప్టెంబరు 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నాయకనాయికలు ప్రస్తుతం ఈ మూవీ ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ప్రేమ, యవ్వనం, స్నేహం, భావోద్వేగాల సమ్మేళనంగా 'ఎపిక్'ను తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.

## వచ్చే ఏడాది 'లైకీ లైకా'?



రషా థడానీ

'శ్రీనివాస మంగాపురం' చిత్రంతో తనదైన నటనతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించింది బాలీవుడ్ కథానాయిక రషా థడానీ. ఇప్పుడామె మరో ప్రేమకథతో కుర్రకారుని ఆకట్టుకోవడానికి సిద్ధమవుతుంది. రషా, అభయ్ వర్మ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'లైకీ లైకా'. సౌరభ్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రొమాంటిక్ డ్రామాని ఈ ఏడాది థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించింది చిత్రబృందం. ఇప్పుడీ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రేమికుల రోజున విడుదల చేయాలని నిర్ణయించారట. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్-ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు రషాతో ఈ చిత్రంలో ఒక ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించనున్నట్లు సమాచారం.

## సీడ్ గణేశుడిని పూజించండి.. చిరంజీవి పిలుపు



ప్రకృతి సంరక్షణ కోసం, పచ్చదనం పెంపుకోసం ఈ సారి అందరూ సీడ్ గణేశుడిని పూజించాలని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని చెప్పారు. సీడ్ గణేశుడిని పూజించి ఆ తర్వాత ఇంట్లోనే నిమజ్జనం చేయడం వల్ల.. వినాయకుడు మొక్కై ఎదిగి మనల్ని ఆశీర్వదిస్తాడని తెలిపారు. 'గ్రీన్ ఇండియా చాలెంజ్' రూపొందించిన సీడ్ గణేశా ప్రతిమలను చిరంజీవి తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ రూపకర్త, మాజీ ఎంపీ సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను ఓ యజ్ఞంలా భావించి ఇప్పటికే 20 కోట్ల మొక్కలు నాటేలా లక్షల మందిని ప్రోత్సహించిన సంతోష్.. అభినందనీయుడని, ఆయన దీక్షకు తమ వంతు తోడ్పాటు ఉంటుందని ప్రశంసించారు.

## బ్యాక్ టు వర్క్.. ఈ క్షణాలు మిస్ అవుతానంటూ రష్మిక పోస్ట్..



షూటింగ్‌లో గాయపడిన నటి రష్మిక కోలుకున్నారు. తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఇంట్లో విశ్రాంతి తీసుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 'తిరిగి షూట్‌కు వెళ్తున్నా. కానీ, ఈ క్షణాలను మాత్రం కచ్చితంగా మిస్ అవుతాను' అంటూ వరలక్ష్మి వ్రతం చేస్తోన్న ఫొటోలతో పాటు.. ఇంట్లో తాను ఆడుకున్న పజిల్ చిత్రాలను షేర్ చేశారు. ఎట్టకేలకు రష్మిక తిరిగి సెట్‌లోకి వెళ్లడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు జాగ్రత్తలు చెబుతూ.. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు. మైసా' (Mysaa) చిత్రీకరణ సమయంలో రష్మిక గాయపడ్డారు. షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా తుంటి భాగంలో బలమైన గాయమైంది. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో రష్మిక ఇంట్లో ఉండి తరచూ తన హెల్త్ అప్‌డేట్‌లతో పాటు, తాను చేస్తోన్న పనులను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారు.




## యశ్‌ది చాలా సున్నితమైన మనస్తత్వం: తారా సుతారియా



పాన్ ఇండియా స్టార్ యశ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'టాక్సిక్' గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఇటీవల విడుదలై మిశ్రమ స్పందన అందుకుంటోంది. ఇందులో రెబెక్కా అనే కీలక పాత్రలో బాలీవుడ్ భామ తారా సుతారియా నటించిన విషయం తెలిసిందే. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ఆమె.. యశ్ వ్యక్తిత్వం గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సినిమాలోని పాత్రలతో పోలిస్తే, నిజ జీవితంలో యశ్ పూర్తిగా భిన్నమని పేర్కొన్నారు.

యశ్‌ను 'మేల్ ఫెమినిస్ట్' అనొచ్చా?అన్న ప్రశ్నకు ఆమె బదులిచ్చారు 'కచ్చితంగా అనొచ్చు. ఆయన చాలా సున్నితమైన వ్యక్తి. ఎదుటివారి గురించే ఎక్కువగా ఆలోచిస్తుంటారు. సినీ పరిశ్రమలో ఇలాంటి వ్యక్తులు ఉండడం చాలా అరుదు. అందరిపైనా యశ్ ఎంతో గౌరవాన్ని ప్రదర్శిస్తారు' అని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో హీరోయిన్ల మధ్య పోలికలపైనా తారా స్పందించారు. 'సోషల్ మీడియాలో ఎప్పుడూ హీరోయిన్లను ఒకరితో మరొకరితో పోలుస్తుంటారు. పురుషులను అలా ఎప్పుడూ పోల్చరు కదా. ఇండస్ట్రీలో ఒక్కో నటికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఎవరికి తగ్గ పాత్రల్లో వాళ్లు నటిస్తుంటారు. అలాంటప్పుడు ఈ పోలికలు ఎందుకు?" అని తారా ఒకింత అసహనాన్ని వ్యక్తం చేశారు.

కాగా, 'కేజీఎఫ్-2' తర్వాత నాలుగేళ్ల విరామం తీసుకుని యశ్ నటించిన చిత్రమిది. ఇందులో నయనతార, కియారా అద్వాణీ, హ్యూమా ఖురేషీ, రుక్మిణీ వసంత్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈనెల 26న ఈ చిత్రం థియేటర్లలో విడుదలైంది.

## అప్పుడు గర్వం తలకెక్కింది.. 'ఇలాగైతే ఇండస్ట్రీలో కష్టమే' అన్నారు: నమిత

కెరీర్ తొలినాళ్లలో వరుస సినిమాలతో తనకొచ్చిన పేరు, ప్రఖ్యాతుల కారణంగా అహంకారం, తలకెక్కి నష్టపోయినట్లు ఒకప్పటి క్రేజీ హీరోయిన్ నమిత అభిప్రాయపడ్డారు. వరుస విజయాలు, మీడియా ఇచ్చిన ప్రాధాన్యం కారణంగా తన ప్రవర్తన అసాధారణంగా ఉండేద న్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన కెరీర్‌కు సం బం ధించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

"నటి గా కెరీర్‌ను ప్రారంభించిన తొలిరోజుల్లో నాలో గర్వం ఉండేది. ఎవ రినీ లెక్క చేసేదాన్ని కాదు. ఈ విషయమై చాలా నన్ను మంది హెచ్చరిం చారు. 'నువ్వు ఇలాంటి వైఖరే అనుసరిస్తే, ఇండస్ట్రీలో ఎక్కువ రోజులు కొనసాగలేవు' అన్నారు. దీంతో నెమ్మదిగా నాలో మార్పు మొదలైంది. నా ప్రవర్తన కారణంగా సహనటులు, టెక్నీషియన్స్, జూనియర్ ఆర్టిస్ట్‌లు చాలా ఇబ్బంది పడ్డారట. ఒకరిద్దరు కాదు, చాలా మంది ఈ విషయాన్ని నాకు చెప్పారు" అని నమిత చెప్పుకొచ్చారు. 17ఏళ్ల వయసులో మిస్ సూరత్‌గా ఎంపికైన నమితను ఆ తర్వాత మిస్ ఇండియా పోటీల్లో థర్డ్ రన్నరప్‌గా నిలిచారు. దీంతో వరుస సినిమా అవకాశాలు ఆమెను పలకరించాయి. తెలుగులో 'సొంతం'తో వెండితెరకు పరిచయమైన ఆమె తమిళంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.



Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ,** RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**